# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సుళువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవుసరం !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box_80, KAKINADA, A.P 533 001.

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 11 ఏప్రియల్ 1991 సంచిక 9


## సంపాదకీయము

### నేనెవరు?

( Who Am I ? )

ఈ మధ్య చాలామంది తమ వంశ వృక్షమును గూర్చి ఆసక్తిని కలిగియున్నారు. వారి పితరులయొక్క సమాచారమును, వారు ఎక్కడ నుండి వచ్చిరో ఆ సంగతులను, వారిని గూర్చిన వాస్తవాలను సేకరించుచున్నారు. ఇది ఆసక్తికరమైనదే సంశయం లేదు. కాని నేనైతే నన్ను గూర్చి నేను బాగుగా ఎరుగుదును.

నేను ఆదాము కుమారుడను. దేవుడు పురుషుని, స్త్రీని సృజించి వారికి నరులని పేరు పెట్టెను (ఆది 5:1-2). అందరు వారి మూలముగా కలిగినవారు. నేనుకూడ వారిలో ఒకడినే.

నేను దేవుని సృష్టి. దేవుడు సమస్తమును సృజించినవాడు. దేవుడు ముఖాముఖిగా ఇప్పుడు మనతో మాటలాడుట లేదు. కాని

ఆయన నిర్ణయించిన సృష్టిక్రమమును బట్టి ఆయన ద్వారా నేను సృజింపబడితిని.

నేను శరీర ఆత్మల సంగమమై యున్నాను. (Dual Being) నేను నరుడను. కాని నేను ఆత్మను కలిగియున్నాను. దేవుని పోలికగా పుట్టినవాడను (ఆది 1:26, 27; ఆది 2:7).

నేను ఆత్మసంబంధినై యున్నాను. ముందుచెప్పిన ప్రకారము లోకమంతటికంటె విలువైన ఆత్మను నేను కలిగియున్నాను. ప్రకృతిలో అది నిత్యమైనది. క్రీస్తు సెలవిచ్చెను: "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు?" (మత్త 16:26).

నేను పాపిని. నేను లోకములో పాపము లేకుండ జన్మించితిని. నేను ఆదాము పాపమునకు గాని మరే యితర వ్యక్తి పాపమునకు గాని వారసుడను కాను. కాని మంచి చెడ్డలను గ్రహించు వయస్సు వచ్చినప్పుడు నా కార్యముల నిమిత్తమై దేవునికి లెక్క ఒప్పగింపవలసినవాడనై పాపినైతిని. ఈ విధముగ మానవులు పాపము చేసిరని పౌలు చెప్పుచున్నాడు (రోమా 3:23). అయినప్పటికిని నేను దేవునికి విధేయుడనైనప్పుడు నా పాపములకు ఆయన క్షమాపణ అనుగ్రహించెను. నేను ఒక మానవుడను. నేను పవిత్రుడను కాను. అందువలన నేను పాపినై యున్నాను.

నేను దేవుని విశ్వాసిని. దేవుడున్నాడని ఆయన సమస్తమును సృజించెనని నేను నమ్ముచున్నాను (ఆది 1:1). "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొందురు" కీర్త 14 : 1. హెబ్రీ లేఖకుడు ఇట్లు చెప్పెను. "విశ్వాసము లేకుండ దేవునికిష్టుడై

యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నా డనియు తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" హెబ్రీ 11 : 6.

నేను క్రీస్తు విశ్వాసిని. ఆయన దేవునియొద్దనుండి పంపబడిన వాడని, దేవుని కుమారుడని, మానవుల పాపముల నుండి వారిని రక్షించు నిమిత్తమై సిలువపై చనిపోయెనని నమ్ముచున్నాను (యోహా 3:16-17; రోమా 5:8). నేను క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములను, ఆయన దేవుని కుడిపార్శ్వమున ఉండి నేడు పరిపాలన చేయుచున్నాడని, తన ప్రజలను ఒక దినమున పరలోకమునకు కొని పోవునని నమ్ముచున్నాను (1 కొరింథీ 15:1-4; అపొ. కా. 2:22, 23; యోహా 14:1-3). క్రీస్తు సెలవిచ్చెను: "దేవునియందు విశ్వాసముంచు చున్నారు. నాయందును విశ్వాసముంచుడి" యోహా 14 : 1. ఆయన మరల ఈలాగు సెలవిచ్చెను. "మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయననని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనేయుండి చనిపోవుదురని వారితో చెప్పెను" యోహా 8:24.

నేను రక్షింపబడితిని. నేను దేవుని వాక్యమును విని, విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది క్రీస్తునందలి నా విశ్వాసాన్ని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ప్రభువునకు విధేయుడనైతిని. క్రీస్తు సెలవిచ్చెను: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16). ఈ వచన భాగాలను చదవండి: రోమా 10:17; హెబ్రీ 11:6; అ.కా. 17:30; మత్త 10:32 మరియు అ.కా. 2:38.

నేను తిరిగి జన్మించిన వ్యక్తినై యున్నాను. క్రీస్తు సెలవిచ్చెను: "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మిం

చితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహా 3:5). నేను ప్రభువును విశ్వసించి సువార్తకు విధేయుడనగుట ద్వారా ఇది జరిగించితిని. ఆయన రాజ్యములో, సంఘములో అనగా ఆయన కుటుంబములో ప్రవేశించుట కొరకు నీటి బాప్తిస్మమునందు నేను క్రీస్తుతో కూడ పాతిపెట్టబడుట ద్వారా విధేయుడనైతిని (రోమా 6:3; అ.కా. 2:47).

నేను క్రీస్తుసంఘ సభ్యుడను. నేను చెప్పిన ప్రకారము ప్రభువునకు విధేయుడనగుటద్వారా ఆయన నన్ను రక్షించి తన సంఘముతో చేర్చెను. ఎవరైతే రక్షణకొరకు విధేయులయ్యారో వారిని గూర్చి పేతురు ఇట్లు చెప్పెను: "ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను" అ.కా. 2:47. మరో మాటలో నేను సంఘములోనికి బాప్తిస్మము పొందితిని. "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మన మందరము ఒక్క ఆత్మను పానముచేసిన వారమైతిమి" 1 కొరింథీ 12:13. ఇక్కడ ఒకే శరీరము అను మాటకు సంఘము అని అర్థము. కొలస్స 1:18; ఎఫె 1:22-23.

నేను క్రీస్తులో ఉన్నాను. బాప్తిస్మము పొందుటద్వారా క్రీస్తులోనికి ప్రవేశించితిని. పౌలు చెప్పెను: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా!" రోమా 6:3. అతడు ఇంకనూ ఈలాగు చెప్పెను. "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను ఇదిగో క్రొత్తవాయెను" 2 కొరింథీ 5 : 17.

నేను పరిశుద్ధాత్మ అను వరము పొందినవాడను. నేను పరిశుద్ధాత్మ యొక్క అద్భుత శక్తిని కలిగియుండలేదు. కాని

నేను పరిశుద్ధాత్మను కలిగియున్నాను. రక్షణ పొందగోరుచున్న వారికి పేతురు చెప్పిన దేమనగా "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ.కా. 2 : 38). క్రీస్తు, దేవుడు నాలో నివసించుచున్న మాదిరిగ పరిశుద్ధాత్మ నాయందు నివసించుచున్నాడు (ఎఫె 4:6; కొలస్స 1:27).

నేను దేవుని కుమారుడను. పౌలు ఇట్లు వ్రాసెను: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" గలతి 3:26-27.

నేను క్రైస్తవుడను. క్రీస్తును వెంబడించుట యందును విధేయుడనగుటద్వారా నేను క్రైస్తవుడనైతిని. ఆయన నామమును నేను ధరించితిని. నా మాటయందును క్రియయందును క్రీస్తును పోలి యుండుటను కోరుకొనుచున్నాను. రక్షణ ఈ నామమందున్నది (అ.కా. 4 : 12). అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడిరి (అ.కా. 11 : 26). నేను ఈ నామమునుబట్టి సిగ్గుపడకూడదని పేతురు బోధించెను. 1 పేతురు 4:16.

నేను దేవుని ఆరాధించువాడను. క్రీస్తు చెప్పెను, "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" యోహా 4:24.

నేను దేవుని పనివాడను. నేను ఆయనకు సేవచేసి, ఆయన వాక్యమును బోధించి ప్రకటించి ఆయన సువార్త వ్యాప్తి నిమిత్తమై కృషి చేయుదును. పౌలు మాటలను వినండి, "నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని

మెరిగి స్థిరులును, కదలనివారును ప్రభువు కార్యాభి వృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి" 1 కొరింథీ 15:58.

నేను ఒక మాదిరిని. నేను ఇతరుల యెడల జాగ్రత్తను కలిగియుండి నా ప్రభావము వారిపై నుండునట్లు కృషి చేయుదును. వారిని క్రీస్తునొద్దకు తీసుకొని వచ్చుటయే దీనియొక్క అర్థము. క్రీస్తు సెలవిచ్చెను: "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" మత్త 5:16.

అవును. నేను అట్టి వాడినే. నేనెవరినో, నేనెక్కడినుండి వచ్చితినో, ఇక్కడ నేనెందుకు నివసించుచున్నానో నా ప్రయాణ మెక్కడికో నేను బాగుగా ఎరుగుదును. చాలామందికి వారెవరో వారికి తెలియదు. వారెక్కడనుండి వచ్చిరో, వారెందు కిక్కడ నివసించుచున్నారో వారి ప్రయాణ మెక్కడికో వారెరుగరు. కొందరు ఒక చిన్న జంతువు నుండి ఉద్భవించినట్లు తలంచుచున్నారు. నిత్యుడగు దేవుని వారు విశ్వసించరు. ఆత్మనుగూర్చిన తలంపు వారికి ఉండదు. వారి మరణము ఒక జంతు మరణముతో సమానమని, అదే మా జీవితానికి అంతమని, తరువాత మాకు ఇక జీవము లేదని నమ్ముచున్నారు. ఇదెంత విచారము. ఒకానొక దినాన దేవుని యెదుట నిలువబడి తాము జరిగించిన క్రియల నిమిత్తమై ఆయనకు జవాబు చెప్పవలసి యున్నదని అపవాదియొక్క నరకములో నిత్యము గడపవలసి యున్నదని వారెరుగుదురు. వారు ధనవంతులుగాను జీవితాన్ని పూర్తిగా సంతోషించడానికి ఇది వారికి ఎంతో తేలికైన మార్గము. కాని వారు దేవుని విశ్వసించి ఆయన చిత్తమునకు లోబడవలసి యున్నది.

అనేకులు లోకములో మోసగింపబడుచున్నారు. వారు పాపముతో పుట్టినవారని వారు భావించుచున్నారు. మానవకల్పిత బోధ

లకు విధేయులై అనేక మతాలను స్వీకరించి మానవకల్పిత సంఘము లలో చేరి మానవకల్పిత నామములతో పిలువబడుచున్నారు. వారు రక్షింపబడి పరలోకమునకు వెళ్ళుదుమని భావించినప్పటికిని వారు నశించినవారే. వారి నిరీక్షణ వారిలోను వారు వెంబడించుచున్న వారిలో మాత్రమే ఉన్నది.

నా స్నేహితుడా, నీవెవరు? నీకు తెలిసికొనాలని ఆశ ఉంటే బైబిలునొద్దకు రమ్ము. దేవుని వాక్యము నీకు సమస్తమును బోధించును. అది నీవు ఇక్కడ ఎందుకు నివసించుచున్నావో, నీవెట్లు రక్షింపబడగలవో, పరలోకమందు నీకు నివాసమెట్లు లభించునో బోధించును. నీకు సమయము తరుణము ఉన్నది. నీవు విధేయుడవు కావాలని కోరుకొంటే ఎంతమాత్రము అశ్రద్ధ చేయవద్దు సుమా!

---

## దేవుండ్లు కాని దేవుండ్లు

"కాబట్టి మీరు యెహోవా యందు భయభక్తులు గలవారై ఆయనను నిష్కపటముగాను, సత్యముగాను సేవించుచు, మీ పితరులు నది అద్దరిని ఐగుప్తులోను సేవించిన దేవతలను తొలగద్రోసి యెహోవానే సేవించుడి. యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి, మీ రెవరిని సేవింపకోరుకొనినను నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనెను" (యెహోషువా 24 : 14, 15). ఇశ్రాయేలీయులు సంతతికి దేవుడు స్వాస్థ్యముగా ఇచ్చిన కనాను దేశమును యెహోషువా ఆయా గోత్రముల ప్రకారం పంచియిచ్చి

చివరిగా పలుకుచున్న మాటలు ఇవి. ఇవి వారి ఆత్మీయ జీవితానికి సంబంధించిన గొప్ప విషయములు. పూర్వము ఇశ్రాయేలీయులు అన్యజనులతో కలిసి వారి దేవుళ్ళను పూజించి దేవునికి అవిధేయులైరి. వీరియొక్క అవిధేయతనుబట్టి నలువది సం॥లు అరణ్యములో సంచరింపవలసి వచ్చెను. నిజమైన దేవుని విడచి, తమ్మును ఐగుప్తు బాని సత్వమునుండి విడిపించిన దేవుని విడచి దేవుండ్లు కాని దేవుండ్లను పూజించి దేవుని దృష్టికి పాపులైరి. కావున యెహోషువా ఇశ్రాయేలీయుల ముందు నిజమైన దేవుని, దేవుండ్లు కాని దేవుండ్లను ఉంచి మీరు ఎవని సేవింప కోరుకొందురో నిశ్చయించుకొనుడని చెప్పుచున్నాడు. దేవుడు మానవునికి స్వయముగా నిర్ణయాలు తీసుకొనే మనస్సును ఇచ్చి యున్నాడు. అతడు మంచినిగాని, చెడునుగాని చేయవచ్చును. అయితే దాని పర్యవసానములను అనుభవింపలసి యుండును.

మన జీవితములో ఎన్నుకోలేని విషయాలు, ఎన్నుకోగల విషయములు గలవు. పుట్టుక, మరణము, ప్రకృతిని క్రమపరచుట మనము ఎన్నుకోలేని విషయాలు. కాని జీవిత భాగస్వామి అనగా భార్య లేక భర్తను, ఉద్యోగమును లేదా ఏదైనా పనిని, అనుసరించవలసిన మతమును మనము ఎన్నుకొనవచ్చును. అయితే ఈ నిర్ణయాలు బాధ్యతను, సామర్థ్యాన్ని కలిగి యుండును.

దేవుండ్లు కాని దేవుండ్లను గూర్చి దేవుడు పాత నిబంధనలో అనేకసార్లు ఇశ్రాయేలీయులకు చెప్పి వాటి జోలికి పోవద్దని హెచ్చరించెను. ఇశ్రాయేలీయుల ముందు ఉంచబడిన దేవుండ్లు ఎవరనగా:
1. కల్దీయులు, అగ్నిని, వెలుతురుని, సూర్యుని పూజించెడివారు.
2. ఐగుప్తీయుల దేవుండ్లు - కోతి సంతతి, పాములు, కూరగాయలు, గుంటనక్క తల, 3. కనానీయుల దేవుండ్లెవరనగా బాలు, అష్తారోతు, మరొకవైపు జగత్తును అందలి సమస్తమును సృష్టించిన సర్వశక్తిగల

వాడైన దేవుడు యెహోవా. ఇశ్రాయేలీయులు ఇప్పుడు నిర్ణయించుకొనవలసిన అవసరత ఏర్పడినది. యెహోషువా అయితే యెహోవాను సేవించుటకు నిర్ణయించుకొనెను.

నేడు కూడా మనముందు దేవుండ్లుకాని దేవుండ్లు ఉంచబడి యున్నారు. ఆ దేవుండ్లుకాని దేవుండ్లను గూర్చి తెలిసికొందము.

**1. మనోభావము :** కొందరి ఆలోచనలే దేవుడు. వారి యొక్క హృదయతలంపులు, ఉద్దేశ్యములే దేవుడు. వీరు దేవుని ఉనికిని గుర్తింపరు "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" (కీర్తనలు 14 : 1). నేడు ప్రపంచములో బైబిలును ద్వేషించువారు కలరు. 'బైబిలు బండారములు' అని నినాదములు చేస్తూ ఆధారములు, వాస్తవములులేని కొన్ని సంగతులను చూపించుదురు. ఇట్టివారి నిమిత్తమై బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము గలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామె 14 : 12). "దుష్టులు పొగరెక్కి యెహోవా విచారణ చేయడు అని అనుకొందురు" (కీర్తనలు 10 : 4).

క్రైస్తవులు తమ ఆలోచనలే వారికి ప్రాధాన్యమని భావిస్తే వారు దేవుండ్లు కాని దేవుండ్లను సేవించువారై యున్నారు. "హెచ్చువాటియందు మనస్సుంచక తగ్గువాటియందు మనస్సుంచుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దని" (రోమా 12 : 16) పౌలు హెచ్చరించుచున్నాడు. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము" (సామె 3:5). "మనమైతే క్రీస్తు మనస్సు కలిగియుందము" (1 కొరింధి 2 : 16). దేవుడు ప్రతివాని క్రియలు తీర్పులోనికి తెచ్చును (ప్రసంగి 11 : 9).

కనుక మనము మన ఆలోచనలకు గాక దేవుని ఆలోచనలకు చోటియ్యవలెను. ప్రభువు వాక్యమువైపు మన మనస్సు మళ్ళింపవలెను. అప్పుడు మనము నిజదేవుని సేవించువారమగుదుము.

2. **మానవుడు తనకు తానే దేవుడు :** పరిణామ సిద్ధాంతమును నమ్ము వారు దేవుడు లేడని వాదింతురు. కోతినుండి మానవుడు పుట్టెనని వారి భావన. మనము కోతి సంతతియని చెప్పుకొనుట ఎంత సిగ్గుకరమైన విషయము. కాని బైబిలు మానవుని సృష్టినిగూర్చి, అతని ఔన్నత్యమునుగూర్చి చక్కగా వివరించుచున్నది. మహాత్ములు, త్యాగశీలులు, సకల సౌకర్యములు గలవారు ఉండవచ్చు. అయినను వారు మానవులే గాని దేవుడు కాదు. నిజ దేవుని ఉనికిని గుర్తింపనివారు ఈ జీవితకాలము మట్టుకే నిరీక్షణగలవారు. వీరికి నిరీక్షణలేదు, నిత్యజీవములేదు. దేవునికి మానవునికి మధ్య అనేక తేడాలు గలవు. దేవుడు ఆత్మ-మానవుడు శారీరుడు, దేవుడు సర్వశక్తిమంతుడు-మానవుడు బలహీనుడు, దేవుడు సృష్టికర్త, మానవుడు దేవుని సృష్టియై యున్నాడు.

**ధనమే వారి దేవుడు:** అసలు దేవుడు అను మాటకు అర్థమేమి? "దేనినైతే ఎక్కువగా ప్రేమించుదుమో అదే దేవుడు" అని నిర్వచింపబడెను. కనుక దేవునిని గాక ధనమునే ఎక్కువగా ప్రేమిస్తే మనము నిజదేవుని సేవించుటలేదు. "ఈలోక ధనమును గూర్చి యేసు ఇట్లు చెప్పెను: "భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు" (మత్తయి 6 : 19). ధనమును గూర్చి పౌలుకూడా చెప్పెను. "ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను

మంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6 : 9, 10). ఈ లోక ధనము యెడల ఆత్యాశను కలిగి యుండుట యొక్క నష్టములను క్రీస్తు, పౌలు చక్కగా వివరించిరి. కొందరు ధనమునే ప్రేమించుచు అనేక ఇబ్బందులలో చిక్కుకొనుచుండుట మనము గమనించుచుందుము. ధనవంతుడు-లాజరు వృత్తాంతములో ధనవంతుడు చనిపోయి పాతాళములో బాధపడుచున్నట్లు మనకు లూకా వ్రాసెను. ధనాశ కలిగినవాడు ముండ్ల పొదలలో పడిన విత్తనమును పోలియున్నాడు. ధనమోసము ఆ వాక్యమును అణచివేయును (మత్తయి 13:22).

క్రైస్తవులైతే పరలోకమందు ధనమును సమకూర్చుకొనవలెను. మన మంచి క్రియలు, విశ్వాసమే పరలోకధనము. "మనకు కలిగిన వాటితో తృప్తి పొందుదము" (హెబ్రీ 13: 5). ఇతరుల కష్టములో పాలివారమగుదము. ధనమునే ప్రేమించితే మనము నిజ దేవుని సేవించుటలేదు.

4. **వారి కడుపే వారి దేవుడు:** ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని చింతించువారు కలరని ప్రభువు చెప్పెను (మత్త 6 :31). శరీరం ఒక యంత్రంలాంటిది. ఇంధనం ఎక్కువయినా లేకపోయిన సరిగా పనిచేయదు. అయితే మనం కేవలం శరీర సంబంధమైన ఆహారం కొరకు జీవించుటలేదు. కొందరు కడుపుకే దాసులు అని పౌలు చెప్పుచున్నాడు (రోమా 16:18). "నాశనమే వారి అంతము. వారి కడుపే వారి దేవుడు—" (ఫిలిప్పి 3 : 19). తినుము, త్రాగుము సుఖించుము అని చెప్పుకొన్న గర్విష్టుడైన ధనవంతు డేమయ్యెనో మనకు తెలుసు. కాబట్టి క్రైస్తవులు ఆత్మీయ ఆహారం కొరకు ప్రయాస పడాలి

(యోహా 6:27); "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని" అని యిర్మీయా చెప్పుచున్నాడు (యిర్మీయా 15 : 16). "ఈ గ్రంథపు చుట్టను తినుము అని యెహెజ్కేలు ఆజ్ఞాపింపబడెను" (యెహెజ్కేలు 3 : 1). "ఆత్మయే జీవింపజేయుచున్నది. శరీరము కేవలము నిష్ప్రయోజనము" (యోహా 6 : 63).

ఇంతవరకు దేవుండ్లు కాని దేవుండ్లను గూర్చి చూచియున్నాము. ఇప్పుడు నీవు నిజదేవుని సేవింప బద్ధుడవై యున్నావు. ఈ దేవుడు సృష్టికర్త, తరతరాల నుండి దేవుడు, యుగాల వెంబడి యుగాలవరకు దేవుడు ఈయనే. ఈ దేవుడే మన పాలిట దైవము. ఈ దేవునిలో ఇంకా ఎవరైనా లేకపోతే ఈనాడే వాక్యము విని విశ్వసించి, మారుమనస్సు పొంది, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. దేవుడు మనకు నిత్యజీవం అనుగ్రహించు గాక !

—దేవరపల్లి చిరంజీవి,
స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ.

---

## ఈయన మాట వినుడి

( మత్తయి 17 : 5 )

"ఈయన (క్రీస్తు) నా ప్రియ కుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను ఈయన మాట వినుడి" అను శబ్దము మహాదివ్య మహిమ నుండి పరిశుద్ధ పర్వతముమీద ఉన్న క్రీస్తునొద్దకు వచ్చినపుడు తండ్రియైన దేవుని వలన ఘనత మహిమ ఆయన పొందెను.

మహామహిమలో ప్రకాశించుచున్న క్రీస్తుతో మాట్లాడుచున్న మోషే, ఏలీయాలు కూడా ఆ పరిశుద్ధ పర్వతముపై రూపాంతరము

పొందిన క్రీస్తుతో కనబడుచుండుట చూచిన పేతురు ఈ ముగ్గురు యెడల సమ భావముగలవాడై వారికి మూడు గుడారములు కట్టి అక్కడే ఉండిపోవుట ఉత్తమమని తలంచి చెప్పెను. వెంటనే తండ్రియైన దేవుడు దివ్యమహిమలోనుండి పై రీతినిమాట్లాడి క్రీస్తు మాట వినవలెనని హెచ్చరించెను.

అంత వరకు ప్రవక్తలద్వారా దేవుడు వారితో మాట్లాడినాడు. క్రీస్తు ప్రవక్తలలో ఒకడుగా లోకానికి రాలేదు గాని దేవుని ప్రియ కుమారుడుగా ప్రత్యక్షపర్చబడెను. మోషే ధర్మశాస్త్రము ప్రవక్తల వచనములకు వేరుగా క్రీస్తు మాటలను వినవలసిన చట్టము, లేక నియమము బయలుపర్చబడెను (రోమా 3:21-22, హెబ్రీ 1:1-2 చదవండి). ఏలయనగా మొదటి నిబంధన లోపములేనిదైతే రెండవ దానికి అవకాశముండనేరదు. "ఆ రెండవ దానిని స్థిరపరచుటకై మొదటి దానిని కొట్టివేసియున్నాడు" (హెబ్రీ 8:7, 10:9).

ఈ రోజులలో విశ్వాసులము, ఆత్మసంబంధులము అంటూ చెప్పుకొనే అనేకులు ధర్మశాస్త్రము ప్రవక్తల వచనములు, క్రీస్తు మాటలకున్న భేదము తెలియక పితరులతో ప్రవక్తలు చెప్పిన ఆజ్ఞలు అనుసరించి తాము రక్షించబడినట్లు భావించి మోసపోవుచున్నారు.

ఉదా॥ ఒకని రక్షణానుభవ సాక్ష్యము ఎట్లు చెప్పుచున్నాడో వినండి. దర్శనములో యెషయా 1:18 చదువుమని స్వరం వినిపించింది. నా హృదయములోనుండి నా పాపాలు కడుగబడి హిమమంత తెల్లగా చేయబడెనని దేవుడు ఆ దర్శనముద్వారా నాతో మాట్లాడి నన్ను రక్షించాడంటు తృప్తిపడి ప్రకటించుచున్నాడు. పాపికి రక్షణ కలిగించుటకు, పితరులతో ప్రవక్తలు చెప్పిన మాటల ప్రకారము చేయుట దేవుని ఏర్పాటుకాదు. క్రీస్తు మాటలలో ఆ బోధ ఉపదేశింపబడలేదు.

రెండవది దర్శనములో స్వరము వినిపింపజేసి పాపులను రక్షించుదునన్న వాగ్దానముకూడా కుమారుని మాటలలో కనబడదు.

## క్రీస్తు మాట జీవపు మాట

క్రీస్తు సర్వాధికారము గల దేవుడై యుండి శరీరమును బట్టి యూదులలో మనుష్య కుమారునిగా పుట్టెను. యూదులు మోషే ధర్మశాస్త్రమువలన ఏ విషయములలో నీతిమంతులుగా తీర్చబడలేక పోతిరో ఆ విషయములన్నిటిలో విశ్వసించు ప్రతివాడును క్రీస్తు వలననే నీతిమంతుడుగా తీర్చబడుచున్నాడు (రోమా 9 : 5, అ. కా. 13 : 39).

క్రీస్తు వారితో "నేను చెప్పియున్న మాటలు ఆత్మయు జీవము నైయున్నవి గాని మీలో నమ్మనివారు కొందరున్నారని" చెప్పెను (యోహా 6 : 63). అన్నట్టు ఆయనను విడిచి అనేకులు వెనుకకు వెళ్ళిపోయారు. క్రీస్తు నిజముగా నిత్యజీవపు మాటలు గలవాడని గుర్తించిన శిష్యులు ఆయనను విడువక వెంబడించి యుండిరి. యూదా మత నాయకులు మోషే పీఠంమీద కూర్చుండి, అంధులైన మార్గదర్శకులుగా వారిని నడిపించేవారు. అట్టి మతాధికారులు క్రీస్తు మాటలు వినకుండా యూదులను కట్టడలో పెట్టి వెలి ప్రకటించి, వారిలో ఎవరును బహిరంగంగా క్రీస్తును అంగీకరించకుండా చేసిరి. అయినను అంధులైన యూదా పెద్దలు కట్లు తెంచుకొని ప్రవాహమువలె క్రీస్తును వెంబడించుచు, ప్రజలు పాపములనుండి రోగముల నుండి విడుదలపొంది క్రీస్తుతో ఉండేవారు.

క్రీస్తు పాపుల రక్షణార్థము సిలువలో బలియై మృతులలో నుండి మూడవ దినమున లేచి, ఇదిగో మృతుడనై తిని గాని యుగ యుగములు జీవించియున్నానని చెప్పెను. సజీవుడైన క్రీస్తు అనేక

ప్రమాణములను ఆయనను వెంబడించిన యూదులకు అగుపర్చి, వారి మధ్యనుండి పరమునకు చేర్చుకొనబడెను.

## మార్పు చెందిన యూదులు

ఆశ్చర్యము ఏమనగా ఆయనను శిలువ వేసిన యూదులలో నుండి మూడు వేల మంది పెంతెకోస్తను యూదుల పండుగరోజున ఆ పండుగ విడిచి క్రీస్తులోనికి వచ్చిరి. యూదుల మతసంబంధమగు ముఖ్య పట్టణమైన యెరూషలేములోనే ఒక్క రోజున ఒక్క ప్రసంగముతో ఇంతటి అద్భుతము చూచిన యూద మత నాయకులు వెర్రెత్తిపోయి క్రీస్తు పని క్రీస్తు మరణంతో అంతమొందక మరింత విస్తృతంగా వ్యాపించుచున్నదని ద్వేషాగ్ని వెళ్ళగ్రక్కుచు యెరూషలేము మొదలైన ప్రతిచోట క్రీస్తు సంఘమునకు మిక్కిలి హింస కలిగించిరి. ఎంతగా హింసలు ఎక్కువ అవుచుండెనో అంతకంటె ఎక్కువ క్రైస్తవులు, క్రీస్తు సంఘాలు అభివృద్ధి చెందుచుండెను. దేవునికి మహిమ కలుగుచుండెను. ఆమెన్

ఇట్లుండగా యూదులలోనుండి వచ్చిన వారిలో కొందరు తమ ఆచారములను పూర్తిగా విడువక క్రొత్త నిబంధన పద్ధతులకు పాత నిబంధన పద్ధతులనుకూడా చేర్చి ఆచరించుట ఆరాధించుట జరిగించెడి వారు అలాగే యూదమత సంబంధమగు క్రియలుకూడా ఆచరించాలి, ధర్మశాస్త్రాన్ని పూర్తిగా విడనాడకూడదు అంటూ బోధించే క్రైస్తవ బోధకులు కూడా బయలుదేరారు.

అందువలన అట్టి మిశ్రమ సిద్ధాంతాన్ని ఎదుర్కొని అట్టి దుర్బోధను, దుర్బోధకులను ఖండించి, వారిని వంకరమార్గములో నుండి క్రీస్తు సువార్త సత్యములోనికి నడిపించుటలో అపొస్తలులు, పెద్దలు, క్రీస్తు పరిచారకులకు మిక్కిలి ప్రయాస కలుగుచుండెడిది. (గల 2:4, 5; అ.కా. 15:1-5).

అదే సమయములో యూదులు కానివారు యూదులులాగ నటిస్తూ వేరొక సమాజాన్ని స్థాపించారు. వారుకూడా క్రైస్తవులకు బహుహింసలు కలిగించేవారు. నిజానికి యూదులుకాని వీరు క్రీస్తువారుగా జీవించగోరి క్రీస్తును అనుసరించితే వారు క్రైస్తవులై యుండ గలిగేవారు. వారు యూదులుగా ఉండగోరినందున వారు కలిగియున్న సమాజానికి సాతాను సమాజమని పరిశుద్ధాత్మ పిలుచుచున్నాడు (ప్రక 2 :9). అసలు యూదమతంతో ఏవిధమైన పొత్తు ఎరుగని అన్యజనులమైన మనము క్రీస్తునందు విశ్వాసముంచి క్రీస్తువారముగా క్రీస్తును ఆరాధించుటలోను, క్రీస్తు వాక్యము అనుసరించుటలోను క్రీస్తు కట్టడలను ఆచరించుటలోను క్రీస్తు మాటలయందు నిలిచియుండక యూదమత సంబంధమగు కొన్ని కట్టడలను, సిద్ధాంతములను, సేకరించి వాటితో కలిపి క్రీస్తు నియమమును మిశ్రమముగా ఆచరించుట, అలాగే యూద మతసంబంధమగు స్థలములు, స్థావరములు కలిగియున్న పేర్లు తెచ్చి క్రీస్తు మార్గములో ఉన్నామంటు, క్రైస్తవులమంటు చెప్పుకొనేవారు తమ సంఘాలకు, సహవాసమునకు మందిరాలకు, వాటిని చేర్చుట ఏమి ! అన్యజనులలోనుండి వచ్చిన వీరు తమవి కాని యూదుల మతసంబంధమగు వాటిని సేకరించి ఆచరించుట ఏల! జీవమునకును భక్తికిని కావలసినవన్నియు, సంపూర్ణ సిద్ధి కలిగించుటకు సరిపడు ఆజ్ఞలు వాగ్దానము లన్నియు క్రీస్తు మాటలలో మనకు సమృద్ధిగా అనుగ్రహించి నేర్పు కలిగించుచుండగా వాటిని విడిచి, నిలువుటంగీలు, ధూపవేదికలు, దీపారాధనలు, వాయిద్య సంగీతాలు ఉపవాస కూటాలు, ఆలాగే వివిధ సంఘాలు ఆయా మినిస్ట్రీస్, సహవాసాలు, మందిరాలు మొదలైన ఇవన్నియు యూదుల మత సంబంధమైన వాటిని క్రీస్తు మాటలకు విరోధంగా తెచ్చిపెట్టుటకును బహు ఆసక్తితో ఆచరించుట ఏమి ! అట్లు చేయుటవలన యూదులు కాక యూదులమని చెప్పుకొనే సాతాను సమాజాలకు చెందినవారగుదు

రని (ప్రక 2:9, 3-9) విచారించుచున్నాను. "ఈయన మాట వినుడి" అను దేవుని ప్రత్యేక ఆజ్ఞకు విధేయత చూపండి. క్రీస్తు బోధయందు నిలిచియుండండి (2 యోహా : 9,10). ప్రభువు మాటలు గమనించండి. క్రీస్తు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదనిరి. ఎవరు ? ఆ కాలపు యూదులే (యోహా 7 :46).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## పాపముయొక్క పర్యవసానం

## (The Consequence of Sin)

బైబిలు గ్రంథములోని మొదటి మూడు అధ్యాయాలు ప్రపంచ సృష్టిని గూర్చి తెలియజేయు చున్నవి. అంతేకాక ఆ తొలి దినములలో దేవునికి మానవునికి మధ్య గల స్పష్టమయిన సంబంధ బాంధవ్యాలను కూడ తెలియజేయు చున్నవి. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించి, ఆ నరుని నుండి స్త్రీని నిర్మించి, ఆ యిరువురిని అనగా ఆదాము హవ్వను సుందరవనమయిన ఏదేను తోటలో ఉంచెను (ఆది 2:8, 9). మానవునికి అవసరమయిన ప్రతి వస్తువును దేవుడు ఆ తోటలో ఏర్పాటు చేసెను. తోట మధ్యనున్న మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్షఫలములు తప్ప మిగతా అన్ని వృక్ష ఫలములను తినుమని దేవుడు వారికి చెప్పెను (ఆది 2:16, 17). వీటన్నిటిని బట్టి దేవునికి మానవునికి మధ్యనున్న స్పష్టమయిన సన్నిహిత సహవాసము తెలుపబడుచున్నది.

ఈ చరిత్ర ఇక్కడతో ఆగిపోకుండ లోకములోనికి పాపము ఏవిధంగా ప్రవేశించెనో తెలుపబడెను. ఒక సర్పము చేసిన పని ఫలితంగా పాపము లోకములో ప్రవేశించెను (ఆది 3:1-6). ఎట్లనగా

సాతాను పాపాన్ని అందంగా చూపించి, తిన వద్దన్న ఆ ఫలాన్ని రమ్యంగా నోరూరించి ఆశపడేలా చేసింది. సర్పం "మీరు చావనే చావరు" అని అబద్ధం చెప్పింది (ఆది 3:4).

ఆదికాండము 3:14-24 అంతటిలో పాపముయొక్క పర్యవసానము వివరించబడి యున్నది. "నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువని ఆదాము అనగా పురుషుడు శపింపబడెను. 2) వేదనతో పిల్లలను కందువు, నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును అని హవ్వ అనగా స్త్రీ శపింపబడెను. 3) సర్ప సంతానము నకును స్త్రీ సంతానమునకును వైరము కలుగజేసెదను. ఆయన నిన్ను తలమీద కొట్టును నీవు వానిని మడిమెమీద కొట్టుదువు అని దేవుడు శపించెను.

## ఆత్మీయ మరణము

పాపముయొక్క భయంకర పర్యవసానము ఆత్మీయ మరణము. మరణము యొక్క ఉద్దేశము వేరుచేయుటే. దేవుడు ఆ దినమునే తక్షణమే మానవుని ఆ ఏదేను తోటనుండి, ఆ జీవ వృక్షమునుండి మరియు తననుండి కూడ వేరుచేసెను. అప్పటినుండి మానవునికి దేవునికి పూర్వముండిన సన్నిహిత బాంధవ్యము లేకపోయెను. పాపము వలన ఏదేను వనములో వుండే ఆనంద జీవితము నాశనమాయెను. మరెన్నటికి ఆదాము హవ్వకు ఆ ఏదేను మధ్యనున్న జీవ వృక్షము అందుబాటులో లేకుండెను. వారు శరీర మరణానికి లోనయిరి. నిత్య జీవితానికి, మరణమనేది లేకుండా చేయగల ఆధారాన్ని దూరం చేసుకున్నారు.

ఆదాము హవ్వ యిద్దరూ దేవుని చిత్తాన్ని ఆజ్ఞను వ్యతిరేకించి నిషేధింపబడిన ఫలము తినుటకు ఏక పక్ష నిర్ణయం తీసుకున్నారు. వారిరువురి స్వతంత్ర నిర్ణయం వలన దేవుని సాన్నిహిత్యాన్ని పోగొట్టుకున్నారు.

కాలం మారుతున్నా పాపంయొక్క పర్యవసానం అప్పుడు యిప్పుడు తరతరాలకు అంటిపెట్టుకొనే యుంది. రోమా పత్రికలో పౌలు అంటున్నాడు: "ఒక మనుష్యుని ద్వారా పాపము, పాపము ద్వారా మరణము లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యు లందరు పాపము చేసినందున మరణము అందరికి సంప్రాప్తమాయెను" (రోమా 5 : 12). ఘోరమైన అంటువ్యాధిలాగ పాపము కూడ ఆదాము హవ్వనుండి తరతరాలకు వ్యాపించెను. మానవుడు దేవుని నీతిని గుర్తించలేక పోవుచున్నాడు, పైగా పరలోక ఆజ్ఞలను ఎల్లప్పుడు అతిక్రమించడమే అభ్యాసము చేసుకున్నాడు. మానవుడు పాపము చేయకుండా వుండాలి. అయితే అతడు దానినే ఎన్నుకొంటున్నాడు. అందరూ పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని (రోమా 3:23) వాక్యము చెబుతుంది. సూర్యుని క్రింద జరిగే ప్రతి దుష్కార్యము: వ్యభిచారము, దొంగతనము, అబద్ధము, బాధ నరహత్యలు—యిటువంటివి ఎన్నో పాపాన్ని తిరిగి చూపిస్తున్నాయి. మన మధ్యనున్న ప్రతి స్మశాన వాటిక పాపము యొక్క శక్తిని దాని పర్యవసనాన్ని నిరంతరం మనకు తెలియజేస్తుంది.

## క్రీస్తులో జీవము

అయితే దేవుడు ఏదేను తోటలో మనకు ఒక ఆశను, అవకాశాన్ని చూపించాడు. "స్త్రీ సంతానము ఆ సర్పముయొక్క తలమీద కొట్టును" (ఆది 3:15). ఇది మానవుడు పాపమునుండి మరణమునుండి తప్పించుకొనే ఒకే మార్గమని దేవుడు సూచించాడు. మానవుడు హృదయపూర్వకంగా తన తండ్రియైన దేవుని సన్నిధికి తిరిగి చేరాలని కోరుకుంటే ఆ పనిని (సర్పము తలను కొట్టుట) చేయగల సమర్థుడే. ఈ వాగ్దానము అవకాశము క్రీస్తునందు సంపూర్ణము చేయబడెను. మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే

మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగునసే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (1 కొరింథి 15:21, 22).

"దేవుని కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" 1 (యోహాను 1 : of) పాపము యొక్క పర్యవసాన మేదనగా పాపరహితుడు, నిర్దోషి అయిన దేవుని కుమారుడు క్రీస్తు సిలువపై మరణించుటయే. క్రీస్తునందు విధేయులైన వారందరి పాపములు కడుగబడి దాని పర్యవసానమయిన మరణము నుండి తప్పింపబడుదురు—తనకు విధేయులైన వారి కందరికి నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9).

క్రీస్తు రక్తముద్వారా రక్షింపబడాలంటే ఆయన అజ్ఞలను సమ్మతించాలి. విశ్వసించని యెడల మన పాపములోనే యుండి మరణింతుము (యోహాను 8:24). మానవుడు మారుమనస్సు పొందాలి, తన పాపపు స్థితినుండి దేవుని తట్టు తిరగాలి, యేసుక్రీస్తే ప్రభువని ఒప్పుకోవాలి (లూకా 13:3; మత్తయి 10:32, 33; రోమా 10:10). బాప్తిస్మము పొందుటవలన పాపములు కడుగబడి నూతన జీవము పొందుదురు (అ. కార్య 2:38; 22:16; రోమా 6: 3,4). ఇట్లు చేయుట వలన పాప విషయములో చనిపోయి క్రీస్తులో జీవింతుము (రోమా 6 : 5-8). క్రీస్తుద్వారానే పాపము యొక్క పర్యవసావము నుండి విముక్తి పొందగలము.

—ఫెల్టన్ స్ప్రాగిన్స్.

# నూతన యెరూషలేము

(New Jerusalem)

యోహాను పత్మాసు ద్వీపములో పరవాసియై యున్నప్పుడు పరలోక దర్శనములో పరిశుద్ధ పట్టణాన్ని చూచియున్నాడు అది

నూతన యెరూషలేము. ప్రకటన గ్రంథము 21-22 అధ్యాయాల్లో చూచినట్టయితే దానిని గూర్చి ఈ క్రింది సంగతులు కనిపిస్తాయి.

1. నూతన యెరూషలేము తన భర్త కొరకు అలంకరించుకొని సిద్ధపడిన పెండ్లికుమార్తెవలె కనిపిస్తుంది (ప్రకటన 21 : 2).

2. నూతన యెరూషలేములో దేవుని నివాసము మనుజులతో కూడ ఉండును (ప్రకటన 21 : 3).

3. నూతన యెరూషలేము పట్టణము సమానమైన పొడవు, వెడల్పులు కలిగినట్టిది (ప్రకటన 21 : 16).

4. నూతన యెరూషలేము అమూల్యమైన నానారత్న పునాదులతో కూడినట్టిది (ప్రకటన 21:19-20).

5. నూతన యెరూషలేము పట్టణ ప్రాకారము సూర్యకాంతములతో కట్టబడినట్టుగా కనిపిస్తుంది (ప్రకటన 21 : 17, 18).

6. నూతన యెరూషలేము పట్టణము బంగారు వీధుల నిర్మాణముతో కనిపిస్తుంది (ప్రకటన 21 : 18, 21).

7. నూతన యెరూషలేము దేవుని మహిమతో ప్రకాశించును (ప్రకటన 21 : 11, 23).

8. నూతన యెరూషలేము పట్టణములో స్ఫటికమువలె మెరయునట్టి జీవజలముల నది కనిపిస్తుంది (ప్రకటన 22 : 1).

9. నూతన యెరూషలేము పట్టణములో జనులకు స్వస్థతనిచ్చు చెట్లు ఉన్నవి (ప్రకటన 22 : 2).

10. నూతన యెరూషలేము పట్టణములో దేవుని సింహాసనము కనిపిస్తుంది (ప్రకటన 22 : 3).

నూతన యెరూషలేము పట్టణములో ఈ క్రింది విషయాలు లేకపోవడం గమనిస్తాం :

1. నూతన యెరూషలేములో సముద్రము లేదు (ప్రకటన 21:1).
2. నూతన యెరూషలేములో కన్నీరు లేదు (ప్రకటన 21 : 4).
3. నూతన యెరూషలేములో మరణము లేదు (ప్రకటన 21 : 4).
4. నూతన యెరూషలేములో బాధ లేదు (ప్రకటన 21 : 4).
5. నూతన యెరూషలేములో చింత లేదు (ప్రకటన 21 : 4).
6. నూతన యెరూషలేములో దేవాలయము లేదు (ప్రకటన 21 : 22).
7. నూతన యెరూలేములో సూర్యుడు లేడు (ప్రకటన 21 : 23).
8. నూతన యెరూషలేములో చంద్రుడు లేడు (ప్రకటన 21 : 23).
9. నూతన యెరూషలేములో అపవిత్రత లేదు (ప్రకటన 21 : 27).
10. నూతన యెరూషలేములో మోసము లేదు (ప్రకటన 21 : 27).
11. నూతన యెరూషలేములో శాపము లేదు (ప్రకటన 22 : 3).
12. నూతన యెరూషలేములో రాత్రి లేదు (ప్రకటన 22 : 5).

ప్రియ చదువరీ! ఎంత ఆశ్చర్య, మహిమాకరమైన పట్టణమో నూతన యెరూషలేము గమనించావా !

అక్కడ రాత్రి లేదు (ప్రకటన 22:5). ఎందుకనగా మహిమగల మన దేవుడు ప్రకాశించుచుండగా గొర్రెపిల్లయే దానికి వెలుగై ప్రకాశించును (ప్రకటన 21:23, 22:5).

అక్కడ దేవాలయము లేదు (ప్రకటన 21:22) ఎందుకనగా దేవుడే దేవాలయమై యున్నాడు (ప్రకటన 21 : 22).

మీరు నూతన యెరూషలేములో ప్రవేశించ గోరుచున్నార !

అయి తేజీవవృక్షమునకు హక్కుగలవారై యుండునట్లు, గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు మీ వస్త్రములను ఉదుకుకొనండి. అప్పుడు మీరు ధన్యులు (ప్రకటన 22 : 14).

"ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను (ప్రకటన 22 : 7) అని దేవుడు సెలవిస్తున్నాడు. కావున ఇలాంటి మహిమాన్వితమైన నూతన యెరూషలేము పట్టణము మన కొరకు సిద్ధపడి యున్నదని తెలిసినప్పుడు, యోహానుతో కలసి మనముకూడ "ప్రభువైన యేసూ, రమ్ము!" (ప్రకటన 22 : 20) అని ప్రార్థించడం మానకూడదు.

—ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ-4.

—o—

## విశ్వాసులే విజేతలు

నిజం పలికే నీతి మంతులు
నిప్పులా మండు తుంటారు
ప్రార్థనా ప్రసంగాలతో వాళ్లు
పవిత్రాగ్ని జ్వాలల్ని రగిలిస్తారు!

వేదికపైనున్న బోధకుని -
వేలాది జనం గుర్తించినట్లే;
బోధకునీ బోధ వినేవాళ్ళనీ
శోధకుడూ గుర్తిస్తుంటాడు!

వేదనతో ప్రార్థించిన యేసు
శోధకునిపై జయమొందినట్లే;
ప్రార్థనాత్మ అప్రమత్త లంతా
శోధనలు జయిస్తారు! (1 పేతురు 5 : 8-10).

—యస్. జె. మేడిద, కొణితివాడ.

## 24

# కొనసాగుట

## ( Continuing On )

మనలో చాలామంది ఆరంభ శూరులే గాని తమ పనిని కొనసాగించి పూర్తిచేయుటలో విఫలులగుచున్నారు.

సొలొమోను కొంతకాలం జ్ఞానిగా ఉన్నప్పటికి చివరి సమయంలో అతడు విఫలుడయ్యెను. కొన్ని సమయాల్లో దావీదు ప్రాభవాన్ని చూసినప్పటికీ అతని జీవితము సమస్యలతో అస్తవ్యస్తమయ్యెను. మోషే గొప్పవాడైనప్పటికిని అతడు తన పనిని కొనసాగించలేకపోయెను. కాని "దానియేలు కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరము వరకు జీవించెను" (దాని 1:21). (ఆంగ్ల బైబిలు నందు 'మొదటి సంవత్సరము వరకు కొనసాగించెను' అని వ్రాయబడినది).

సొలొమోను గొప్ప జ్ఞాని యని అందరూ అభిప్రాయపడుచున్నారు. సొలొమోనుకంటె దానియేలు యొక్క వివేకాన్ని గూర్చి వ్రాయబడిన మూల భాషలోని పదాలను మనము మరువరాదు. సొలొమోను తన జ్ఞానమును బుద్ధిహీనతకు మార్చుకొని గొప్ప పాపములను జరిగించెను. దానియేలు తన పరిశుద్ధతను కాపాడుకొని తన జీవితమందలి అనేక సవాళ్ళ మధ్య దేవునికి లోబడిన వానిగ జీవించెను.

బబులోనులో బానిస స్థానంలో ఉన్న దానియేలు క్రమక్రమంగా ఎదిగి బబులోను సంస్థానమునకు పరిపాలకుడయ్యెను. అతని రాజ్యములో అనేక శ్రమలమధ్య అతడు జీవించెను. ఈ పరిస్థితులలో అతడు స్థంభమువలె నిలువబడెను.

నెబుకద్నెజరు దానియేలును అనేక బహుమానములతో సత్కారములతో నింపెను. రాజు మనుమడైన బెల్షస్సరు దానియే

లను మూడవ అధిపతిగ నియమించెను. మాదీయుడైన దర్యావేషు రాజ్యమంతటిమీద అతని నియమింపవలెనని ఉద్దేశించెను (దాని 6:3).

సింహముల గుహలో దానియేలు అనుభవము తరువాత దానియేలు 6వ అధ్యాయమందలి ఆఖరి వచనములో ఇట్లు వ్రాయబడెను: "ఈ దానియేలు దర్యావేషు ప్రభుత్వ కాలమందును పారసీకుడగు కోరెషు ప్రభుత్వ కాలమందును వర్ధిల్లెను" (దాని 6:28). అయిదుగురు వేరువేరు వంశాలకు చెందిన రాజులకు ఎవరు ప్రధాన మంత్రిగా నుండగలరు? ఈ ప్రశ్నకు జవాబు దానియేలు మాత్రమే. అతడు కొనసాగెను.

అందరి దృష్టిలో అతడు మంచిగా జీవించి కొనసాగెను.

అతని యౌవనదశనుండి రాజ్యమందు కొనసాగెను.

అతడు భక్తిలేని నాయకత్వముక్రింద కూడ భక్తితో కొనసాగెను.

ఈ గొప్ప దైవజనుడు క్రైస్తవ జీవితమును కొనసాగించుటలోను మేలుచేయుట యందును విసుకక యుండునట్లు మనకు మాదిరిగాను ప్రోత్సాహకరముగాను ఉన్నాడు.

—టామ్ కెల్టన్.

---

## సత్యము

## ( The Truth )

సత్యాన్ని గూర్చి యేసు విపులంగా బోధించాడు. "నేనే సత్యమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ఆయన చెప్పాడు (యోహాను 14 : 6). "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" ఆయన చెప్పెను (యోహా 8 : 31, 32).

పొంతిపిలాతు సత్యాన్ని తన చేతులార జారవిడిచాడు. అతడు మంచి ప్రశ్నలే వేసాడు గాని, జవాబు తన ముందు నిలబడగలిగేటట్లు చూడలేకపోయాడు. సత్యాన్ని అంగీకరిస్తే పిలాతు రాజకీయంగా దెబ్బతింటాడు. సత్యాన్ని వెంబడిస్తే తనకు అసౌఖ్యము, అశాంతి, ప్రమాదమున్నది. మరియు విశేషమైన మూల్యం చెల్లించాల్సి వస్తాది. సత్యం కొరకు నిలబడినందున అనేకులు తమ బంధు మిత్రులను, ఆస్తులను కోల్పోయారు. సత్యాన్ని పరిష్కరించకుండా చేతులు కడిగేసుకొంటే తన బాధ్యత తీరిపోవునని పిలాతు అనుకొన్నాడు (మత్త 27 : 24). మనస్ఫూర్తిగా మనం సత్యాన్ని అన్వేషించాలి.

ఏవి సత్యమైనవో వాటియందు క్రైస్తవుడు ధ్యానముంచుకొనాలి (ఫిలిప్పీ 4 : 8). దాన్ని శ్రద్ధాభక్తులతో పఠించాలి (2 తిమో 2 : 15). అంతేకాదు ప్రేమ కలిగి సత్యాన్ని ఆచరించాలి (ఎఫెసీ 4 : 15). సంఘములో యున్న స్త్రీ పురుషులు సత్యాన్ని అన్వేషించి దానికి లోబడుట ఎంతైనా అవసరం. ఏలయనగా సత్యము మాత్రమే మనల్ని స్వతంత్రులుగా చేయును! ★

---

Regd. No. H/KD-45/KD.H.O

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..............................
..............................
..............................
..............................